

బిసి మహిళలకు స్వయం ఉపాధి


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103



సంపుటి - 3 సంచిక -70 శుక్రవారం14 ఆగస్టు 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


## పథకాలకు తోడు సంక్షేమాన్ని

# రెట్టింపు చేసాం

### ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపనలో సిఎం రేవంత్

**పదేళ్ల బిఆర్ఎస్..రెండేళ్ల కాంగ్రెస్ పాలనను బేరీజు వేయండి**

**రాష్ట్రం ఎండిపోవాలని కుట్రలు చేశారు**

**వారు చేసిన చేతబడి తిరగబడింది**

**నగరంలో పేదలకు లక్ష ఇళ్లు నిర్మిస్తున్నాం**




**హైదరాబాద్,ఆగస్టు13 ( జర్నలిస్ట్ వార్త)**

పదేళ్ల బీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. గతంలో ఉన్న పథకాలకు అదనంగా సంక్షేమాన్ని అందిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి సీఎం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదల రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందని.. ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై సీఎం విమర్శలు చేశారు. రాష్ట్రం ఎండిపోవాలని కుట్ర చేశారని ఆరోపించారు. చేతబడుల కోసం కొందరు కర్ణాటక వెళ్లారు.

మిగతా 2లో.

## చర్చలు లేకుండానే ముగిసిన పార్లమెంట్ సమావేశాలు

### చివరి రోజు సైతం విపక్షాల నిరసనలు



**మోదీ, రాహుల్ గాంధీ సభలో ఉండగా..**

**పార్లమెంట్ చరిత్రలో కొత్త అధ్యాయం!**

**ఆరు చరణాల జాతీయ గేయం ఆలాపన**

**ప్రధాని మోదీ, రాహుల్ గాంధీ సహా సభ్యుల హాజరు**

**'వందేమాతరం'కు చట్టబద్ధ రక్షణ వచ్చిన కొద్ది రోజులకే ఘటన**

**రాజ్యసభ కూడా 'వందేమాతరం'తోనే ముగింపు**

**ఢిల్లీ ఆగస్టు13 ( జర్నలిస్ట్ వార్త)**

పార్లమెంట్ చరిత్రలో గురువారం అరుదైన ఘట్టం చోటుచేసుకుంది. వర్షాకాల సమావేశాల చివరి రోజు లోక్‌సభ కార్యకలాపాలు తొలిసారి 'వందేమాతరం'తో ప్రారంభమయ్యాయి. ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సహా సభ్యులంతా సభలో ఉండగా ఆరు చరణాల జాతీయ గీతాన్ని ఆలపించారు.'వందేమాతరం' ఆలాపన పూర్తయ్యాక లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడింది. రాజ్యసభ కూడా జాతీయ గేయంతోనే సమావేశాలను ముగించింది. దీంతో పార్లమెంట్ చరిత్రలో కొత్త అధ్యాయం నమోదైంది.'వందేమాతరం'కు చట్టబద్ధ రక్షణ కల్పించిన కొద్ది రోజులకే ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ గేయాన్ని ఉద్దేశపూర్వకంగా

మిగతా 2లో.

## విదేశాంగ విధానమంటే ఆలింగనాలు కాదు


**: మోదీపై రాహుల్ గాంధీ విమర్శలు**

**ప్రధాని నరేంద్ర మోదీ తీరుపై రాహుల్ గాంధీ ఘాటు విమర్శలు**

**వేదికపైనే కాంగ్రెస్ నేతను కౌగిలించుకుని సెటైర్**

**చైనా, ఇరాన్ విషయంలో భారత వైఖరిని తప్పుపట్టిన రాహుల్**

**బీజేపీ, ఆరెస్సెస్‌ను జోకర్ల బృందంగా అభివర్ణన**




**ఢిల్లీ ఆగస్టు13 ( జర్నలిస్ట్ వార్త)**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రపంచ దేశాల అధినేతలను ఆలింగనం చేసుకోవడం, వ్యక్తిగత స్నేహాలను ప్రదర్శించడం విదేశాంగ విధానం అనిపించుకోదని, దేశ ప్రయోజనాలను కాపాడటమే అసలైన దౌత్యమని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో జరిగిన 'రచనాత్మక్ కాంగ్రెస్' జాతీయ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

మిగతా 2లో.

## భూములు కనిపిస్తే అమ్మేయడమేనా?

**రాయదుర్గంలో హెరిటేజ్ భూముల విక్రయాన్ని ఉపసంహరించాలి**

**వేలంపాటలో కొనుగోలు చేస్తే న్యాయపరమైన సమస్యలు తప్పవు**

**సీఎం రేవంత్‌రెడ్డికి మాజీమంత్రి హరీశ్‌రావు లేఖ**

**హైదరాబాద్ఆగస్టు13 ( జర్నలిస్ట్ వార్త)**

ఎక్కడ ప్రభుత్వ భూములు కనిపిస్తే అక్కడ అమ్మకాలేనా? అని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు ప్రశ్నించారు. నాడు ప్రభుత్వ భూములు పెద్దలు ఇచ్చిన జాతి సంపద అని ఉపన్యాసాలు ఇచ్చి ఇప్పుడు ఎక్కడ భూములు కనిపిస్తే అక్కడ వేలం వేస్తూ, ప్రజల ఆస్తులను అమ్మకానికి పెడుతున్నారని విమర్శించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డికి గురువారం ఆయన బహిరంగలేఖ రాశారు. గతంలో కంచ గచ్చిబౌలి, లగచర్ల, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ఇప్పుడు రాయదుర్గం ఇలా ఎక్కడికక్కడ భూములు అమ్మే కుట్రలు చేస్తుండటం సిగ్గుచేటని విమర్శించారు. రాయదుర్గం పన్మక్త గ్రామంలోని సర్వే నెంబర్ 83/1లో 10.63 ఎకరాల హెరిటేజ్ భూమిని ఈనెల 17, 21 తేదీల్లో టీజీఐఐసీ వేలం వేయడానికి సిద్ధం కావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

మిగతా 2లో.



## ఏనుగులు జీవవైవిధ్యానికి కాపలాదారులు..

**వాటి సంరక్షణ ప్రజా ఉద్యమంగా మారాలి: పవన్ కల్యాణ్**

**ప్రపంచ ఏనుగుల దినోత్సవంలో పాల్గొన్న పవన్ కల్యాణ్**

**దేశంలో ఏనుగుల రిజర్వుల సంఖ్య 26 నుంచి 33కి పెరిగిందన్న డిప్యూటీ సీఎం**

**మానవ-ఏనుగుల సంఘర్షణను అరికట్టేందుకు కర్ణాటక ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నామని వెల్లడి**




**విశాఖపట్నం,ఆగస్టు13 ( జర్నలిస్ట్ వార్త)**

ఏనుగులు కేవలం అడవులకే పరిమితం కాకుండా జీవవైవిధ్యానికి కాపలాదారులుగా, దేశ సంస్కృతి, వారసత్వానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. విశాఖపట్నంలో నిర్వహించిన ప్రపంచ ఏనుగుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన,

మిగతా 2లో.

## మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే

**కొందరు 4శాతం రిజర్వేషన్లపై కోర్టు మెట్లెక్కారు**

**ఇంటింటికీ వెళ్లి ఓట్ల గల్లంతును పరిశీలించండి**

**మైనార్టీల ప్రతిభా సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్,ఆగస్టు13 ( జర్నలిస్ట్ వార్త)**

ముస్లిం మైనారిటీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ముస్లింలకు కాంగ్రెస్ 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, వీటిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్ల రద్దు కోసం అత్యున్నత న్యాయస్థానాల వరకూ వెళ్లారని ముఖ్యమంత్రి విమర్శించారు. అయినా చిత్తశుద్ధితో కాంగ్రెస్ అమలు చేసిందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మైనారిటీల ప్రతిభా సదస్సుకు సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన పలువురు మైనారిటీలకు

మిగతా 2లో.

## త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు

**దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి**



**న్యూఢిల్లీ,ఆగస్టు13 ( జర్నలిస్ట్ వార్త)**

దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దీనివల్ల విద్యుత్ ఉత్పత్తి వ్యయం తగ్గి వినియోగదారులకు తక్కువ ధరకు విద్యుత్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి బొగ్గు

మిగతా 2లో.

## ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు తొలి అడుగు

**ఓటర్ల జాబితాల ప్రచురణకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్**

**సెప్టెంబర్ 3న పురపాలికల్లో, ఆగస్టు 17న కొన్ని పంచాయతీల్లో జాబితాల ప్రకటన**

**ఆగస్టు 31లోగా గ్రామ పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల ఖరారుకు ఆదేశాలు**

**సెప్టెంబర్, అక్టోబర్‌లో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని అంచనా**

**అమరావతి,ఆగస్టు13 ( జర్నలిస్ట్ వార్త)**

ఏపీ లో ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి కీలక ముందడుగు పడింది. రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఓటర్ల జాబితాల ప్రచురణకు నోటిఫికేషన్లు జారీ చేయడంతో ఎన్నికల ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైనట్టయింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా, మున్సిపల్ కార్పొరేషన్లు,

మిగతా 2లో.



# పథకాలకు తోడు సంక్షేమాన్ని రెట్టింపు చేసాం

**మొదటిపేజీ తరువాయి**

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు కేసీఆర్ పరిస్థితి ఉంది. అందుకే అల్లుడు క్షుద్రపూజలు చేశారు. మీరు చేసిన చేతబడి మీపైనే తిరగబడి అష్టదిగ్బంధనం చేస్తుంది. ఫాంహౌస్ నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి వస్తుంది. నా సంకల్పం రాష్ట్రం బాగుకోసం.. అందుకే వర్షాలు పడుతున్నాయి. పదేళ్లు అధికారంలో ఉన్నవారు చేతబడులు చేయిస్తారా? అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు అండగా ఉంటానన్నారు. కూకట్‌పల్లి ప్రజలకు కావాల్సిన పనులు చేయించాలని మంత్రులను ఆదేశిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.మహిళలకు ఉచిత బస్సు పథకం కింద రూ.12వేల కోట్లు చెల్లించాం. మహిళా సంఘాలకు రూ.65వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించాం. మహిళలకు ఉచిత బస్సు పథకం బంద్ చేయించాలని విపక్ష నేతలు ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టారు. 55 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలు అందించాం. మహిళా సంఘాలకు వెయ్యి ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేసి ఇచ్చాం అని రేవంత్ అన్నారు. ఆనాడు నేను పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేస్తే కూకట్ పల్లి ప్రజలు నన్ను ఆశీర్వదించి గల్లీ నుంచి ఢిల్లీకి పంపారని గుర్తు చేసుకున్నారు. ప్రతిపక్షంలో ఉండగా గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో మీరు ఆశించిన మేరకు అభివృద్ధి చేయలేకపోయానన్నారు. కానీ ఇప్పుడు కూకట్ పల్లిని అభివృద్ధి చేసుకునేందుకు అన్ని రకాల అధికారం ఉందన్నారు. మీకు ఎలాంటి అభివృద్ధి కావాలన్నా అడిగి చేయించుకోండి. కూకట్ పల్లి నియోజకవర్గాన్ని ప్రతీక దృష్టితో అభివృద్ధి చేయాలని శ్రీధర్ బాబు గారిని ఆదేశిస్తున్నానని అన్నారు. పదేళ్ల వారి పరిపాలన రెండేళ్ల మా పాలనను బేరీజు వేసుకోండి. తెలంగాణలో 3 కోట్ల 28 లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నాం. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచేలా ఇందిరమ్మ చీరలను సారెగా అందించాం. పెట్రోల్ బంకులు, సోలార్ ఎ÷-లాంట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాం స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను విక్రయించుకునేందుకు శిల్పారామంలో స్టాళ్లను ఇచ్చాం ఒకవైపు గత ప్రభుత్వం చేసిన అప్పులను చెల్లించుకుంటూనే.. మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం అని సిఎం వివరించారు.డబ్బా ఇండ్లు వద్దు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామన్న వాళ్లు మీలో ఒక్కరికైనా ఇల్లు ఇచ్చారా అని ప్రశ్నించారు. పట్టణంలో పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని మా ప్రభుత్వం

ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ కు శ్రీకారం చుట్టింది. మొదటి విడతలో లక్ష ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మీ సొంతింటి కలను నిజం చేసేందుకు మీ సోదరుడిగా మీకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళుతున్నాం అని వివరించారు. ఈ సందర్భంగా 22-ఎ భూముల అంశంపై ఆయన మాట్లాడారు. మీరు కొనుగోలు చేసిన భూమి పొరపాటున 22-ఎలో పడితే ఆ భూమిని మీకే ఇప్పిస్తాను. ఈ విషయంలో నాదీ పూచీ. సమస్య ఉన్న ఒక సర్వే నంబర్‌లో 500 ఎకరాలు ఉంటే అన్నీ నిషేధిత జాబితాలో పెట్టారు. సబ్ నంబర్లు ఇచ్చి సమస్యను పరిష్కరిస్తానని సీఎం తెలిపారు.

# భూములు కనిపిస్తే అమ్మేయడమేనా?

**మొదటిపేజీ తరువాయి**

2020లో ఇదే భూములపై రక్షణ కోరుతూ కోర్టు మెట్లు ఎక్కిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అదే భూమిపై థర్డ్ పార్టీ హక్కులు సృష్టించేలా వేలానికి ఎలా అనుమతిస్తున్నారని ప్రశ్నించారు.

ప్రతిపక్షంలో ఒక మాట అధికారంలోకి వచ్చాక మరో మాటనా? అని పేర్కొన్నారు. జీవో నెంబర్ నాలుగు, సర్వే నెంబర్ 83ను హెరిటేజ్ భూమిగా గుర్తించినట్టు రికార్డులు స్పష్టం చేస్తున్నాయని వివరించారు. హెరిటేజ్ భూములను కాపాడాల్సిన ప్రభుత్వం వాటినే వేలం వేసి అమ్మేందుకు ఎందుకు తొందరపడుతోందని అడిగారు. సీఎం అనుయాయులకు మేలు చేసేందుకేనా? అని ప్రశ్నించారు. ఇదే సర్వే నెంబర్‌లో గతంలో 6.2 ఎకరాలను ఎకరాకు రూ.237 కోట్ల చొప్పున వేలం వేస్తే, ఎస్బీఐ కోర్టుకు ఎక్కిందని గుర్తు చేశారు. దీంతో కోర్టు అంక్షితలు వేసిందని తెలిపారు. ప్రస్తుతం ఈ అంశం హైకోర్టు పరిధిలో ఉందని తెలిపారు. అయినా అదే సర్వే నెంబర్‌లో మరో 10.63 ఎకరాలను వేలం వేయడం వెనుక ఆంతర్యం ఏంటని? ప్రశ్నించారు. న్యాయ వ్యవస్థ అంటే గౌరవం లేదా?అని అడిగారు.

భూమిపై యాజమాన్య వివాదాలు

ఈ భూమిపై యాజమాన్య వివాదాలు ఉన్నాయని హరీశ్‌రావు తెలిపారు. హెరిటేజ్ అంశం, వక్ఫ్ హక్కుల అంశం కూడా ఉన్నాయని వివరించారు. అనేక కోర్టు వివాదాలున్నాయని పేర్కొన్నారు. ఇన్ని సమస్యలు ఉన్నప్పుడు భూమి ఎవరిదో తేల్చకుండా వేలం వేయడం ఎందుకని ప్రశ్నించారు. రూ.రెండు వేల కోట్ల విలువైన హెరిటేజ్ భూములను అమ్మే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరిచ్చారని అడిగారు. ఈనెల 17, 21 తేదీల్లో జరగనున్న టీజీఐఐసీ వేలాలను వెంటనే నిలిపేయాలని డిమాండ్ చేశారు. సర్వే నెంబర్ 83కి సంబంధించిన హెరిటేజ్, రెవెన్యూ, సర్వే, వక్ఫ్ రికార్డులన్నింటినీ బయటకు తీసి సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలు నిగ్గు తేల్చాలని కోరారు. హక్కులు, వివాదాలు తేలకముందే ఈ భూములను కొనుగోలు చేస్తే భవిష్యత్తులో న్యాయపరమైన సమస్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారిలా కాకుండా ముఖ్యమంత్రిగా వ్యవహరించాలని సూచించారు

# బిసి మహిళలకు స్వయం ఉపాధి

## ఉచిత కుట్టుమిషన్లు ప్రారంభించిన మంత్రి పొన్నం

**హైదరాబాద్,ఆగస్టు13 ( జర్నలిస్ట్ వార్త)**



బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలనలో బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని పొన్నం చెప్పారు. బీసీ మహిళలకు 100 శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టుమిషన్లు అందిస్తామని.. వారిని కేవలం లబ్దిదారులుగా కాకుండా స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామిక వేత్తలుగా తీర్చదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఒక్కో దాని విలువ రూ.12,000 కాగా, లబ్దిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా 100 శాతం సబ్సిడీపై అందజేస్తామని చెప్పారు. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు అర్హులైన బీసీ మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

# మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే

**మొదటిపేజీ తరువాయి**




అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మైనారిటీ రిజర్వేషన్లకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యతిరేకమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ నేతృత్వంలోనే మైనారిటీలకు సంక్షేమం అందుతోందని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే సెక్యులర్ పార్టీ అని, హిందూ, ముస్లింలను రెండుకళ్లలా చూస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం గ్రూప్-1 పరీక్షలను నిర్వహించలేకపోయిందని ఎద్దేవా చేశారు. ఓ ఆర్ఎంపీ డాక్టర్‌ను టీజీపీఎస్సీ సభ్యుడిగా నియమించారని సీఎం ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఉన్నంతకాలం దేశంలో సెక్యులర్ వర్గాలకు మనుగడ ఉంటుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హిందూ, ముస్లింలను రెండు కళ్లలా కాంగ్రెస్ చూస్తోందని చెప్పారు. నగరంలోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో మైనారిటీస్ ఎక్సలెన్స్ సమ్మిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ ఇచ్చింది. వాటిని రద్దు చేయాలని కొందరు హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గుజరాత్‌లో మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేసి చూపాలని సవాల్ విసిరాం. లౌకిక వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పోరాడుతుంది. బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగం, రూ.3కోట్ల ప్రోత్సాహకం ఇచ్చాం. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 నియామకాల ఊసే లేదు. ఒకసారి నియామకాలు చేపట్టినా పల్లీ, బఠానీల్లా ప్రశ్నపత్రాలు అమ్మారు. మా ప్రభుత్వం వచ్చాక టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశాం. అందులో విద్యావంతులను నియమించాం. టీజీపీఎస్సీ ద్వారా గ్రూప్-1 పోస్టులు భర్తీ చేశాం. గ్రూప్-1 రద్దు చేయాలని బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. అక్కడ మంచి న్యాయవాదిని పెట్టి వాదనలు వినిపించాం. తద్వారా నియామకాలు పూర్తిచేశాం. గ్రూప్ 2, 3, 4 పోస్టుల విషయంలోనూ కోర్టుల్లో పోరాడి ఉద్యోగాలు భర్తీ చేశాం'అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీని బలోపేతం చేశామని ధీమా వ్యక్తం చేశారు. రిటైర్డ్ డీజీపీని టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించామని చెప్పుకొచ్చారు. ఎంతో పారదర్శకంగా గ్రూప్-1 పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నిఖత్ జరీన్ కోసం నిబంధనలు పక్కనపెట్టి మరీ గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చామని, అలాగే క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామని సీఎం రేవంత్ గుర్తు చేశారు. మైనారిటీ యువత చదువుతో పాటు నైపుణ్యం సంపాదించాలని కోరారు. జర్మనీ, జపాన్ లాంటి దేశాల్లో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు స్కిల్స్ యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు.

# విదేశాంగ విధానమంటే ఆలింగనాలు కాదు

**మొదటిపేజీ తరువాయి**

విదేశాంగ విధానమంటే విదేశీ నేతలను కౌగిలించుకోవడమన్న ఆలోచన మోదీకి ఎక్కడి నుంచి వచ్చిందో అర్థం కావడం లేదని రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా తన వాదనను వివరించేందుకు వేదికపై ఉన్న రచనాత్మక్ కాంగ్రెస్ చీఫ్ సందీప్ దీక్షిత్‌ను ఆయన ఆలింగనం చేసుకున్నారు. తన నాయనమ్మ, మాజీ ప్రధాని ఇందిరా గాంధీతో కలిసి బాల్యంలో అమెరికా వెళ్లిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ, దేశాధినేతల అధికారిక పర్యటనలు వ్యక్తిగత పర్యటనలు వంటివి కావని ఆయన పేర్కొన్నారు.ఇరాన్, అమెరికా, రష్యాలతో భారత్‌కు సుహృద్భావ సంబంధాలు ఉన్నప్పటికీ, ఇరాన్ వివాదంలో మధ్యవర్తిత్వం వహించే అరుదైన అవకాశాన్ని భారత్ కోల్పోయిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని సరిహద్దు ప్రాంతాల్లో భారత సైన్యం పెట్రోలింగ్‌ను చైనా అడ్డుకుంటోందని, గల్వాన్ ఘర్షణల విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి దేశాన్ని బలహీనపరిచిందని ఆయన విమర్శించారు.బీజేపీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్)లను ఒక 'జోకర్ల బృందం'గా అభివర్ణించిన రాహుల్ గాంధీ, ఆ సంస్థలు దేశంపై ఏకపక్ష రాజకీయ వ్యవస్థను రుద్దేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఇదే కార్యక్రమంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, పార్లమెంటులో ప్రతిపక్షాల గొంతును ప్రభుత్వం విస్మరిస్తోందని మండిపడ్డారు

## ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల

# నిర్వహణకు తొలి అడుగు

**మొదటిపేజీ తరువాయి**

మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో సెప్టెంబర్ 3న ఫొటో ఎలక్టోరల్ రోల్స్‌ను ప్రచురించాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే, గతంలో జాబితాలు ప్రచురించని 20 గ్రామ పంచాయతీల్లో ఆగస్టు 17న ఓటర్ల జాబితాలను ప్రకటించాలని స్పష్టం చేశారు.

ఈ మేరకు ఎన్నికల నిర్వహణకు యంత్రాంగాన్ని సిద్ధం చేసే పనులను ఎస్ఈసీ వేగవంతం చేసింది. ఇటీవల మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖల కార్యదర్శులతో కమిషనర్ పునేఠా సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. ఎన్నికల నిర్వహణలో మొదటి దశ అయిన ఓటర్ల జాబితాల ప్రకటనతో ఈ కసరత్తు మొదలైంది. రాష్ట్రవ్యాప్తంగా 123 కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లోని 4,033 డివిజన్లు, వార్డులకు ఓటర్ల జాబితాలను ప్రచురించనున్నారు. వీటిలో 17 కార్పొరేషన్లు, 88 మున్సిపాలిటీలు, 18 నగర పంచాయతీలు ఉన్నాయి. 2021లో కొన్ని చోట్ల న్యాయస్థానాల్లో కేసుల కారణంగా ఎన్నికలు నిలిచిపోగా, ఈసారి అన్నిచోట్లా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.మరోవైపు, గ్రామ పంచాయతీల్లో కూడా ఎన్నికల ప్రక్రియ ఊపందుకుంది. ఈ నెల 21 నుంచి 31వ తేదీలోగా రాష్ట్రంలోని 13 వేలకు పైగా గ్రామ పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల జాబితాలను ప్రచురించాలని, వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను ఖరారు చేయాలని ఆదేశించారు. 2026 జనవరి 1వ తేదీని అర్హతగా తీసుకుని తుది ఓటర్ల జాబితాలను సిద్ధం చేయనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో మేయర్లు, ఛైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్ పదవులకు రిజర్వేషన్లను ఖరారు చేసే అవకాశం ఉంది. ఈ పరిణామాలతో అంతా ప్రణాళిక ప్రకారం జరిగితే సెప్టెంబర్ లేదా అక్టోబర్ నెలల్లో స్థానిక ఎన్నికలు జరగవచ్చని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# ఏనుగులు జీవవైవిధ్యానికి కాపలాదారులు..




**మొదటిపేజీ తరువాయి**

వన్యప్రాణుల సంరక్షణ, మానవ-ఏనుగుల సంఘర్షణ నివారణపై కీలక వ్యాఖ్యలు చేశారు.

ప్రధాని మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఏనుగుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం వల్ల, 2014 నుంచి ఏనుగుల రిజర్వుల సంఖ్య 26 నుంచి 33కు పెరిగిందని, అలాగే 150 ఏనుగుల కారిడార్లను గుర్తించి రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 132 నుంచి 142 వరకు అడవి ఏనుగులు ఉన్నాయని వెల్లడించారు. పలమనేరు, పార్వతీపురం మన్యం ప్రాంతాల్లో ప్రధాన సమస్యగా మారిన మానవ-ఏనుగుల సంఘర్షణను అరికట్టేందుకు కర్ణాటక ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా కర్ణాటక నుంచి నాలుగు కుంకీ ఏనుగులను తీసుకువచ్చి ముసలివాగు వద్ద ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, వీటి సహాయంతో 50కి పైగా ఆపరేషన్లు నిర్వహించి మానవ మరణాలను 70 శాతం వరకు తగ్గించగలిగామని స్పష్టం చేశారు.

అంతేకాకుండా, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'హనుమాన్' కార్యక్రమంలో భాగంగా ర్యాపిడ్ రెస్పాన్స్ వాహనాలతో పాటు ఏడు ప్రత్యేక వన్యప్రాణుల అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. వీటి ద్వారా ఇప్పటివరకు 200కు పైగా వన్యప్రాణులను రక్షించడంతో పాటు 30కి పైగా ప్రత్యేక ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఏనుగుల సంరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రజలందరి భాగస్వామ్యంతో ఒక ప్రజా ఉద్యమంగా మారాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

# చర్చలు లేకుండానే ముగిసిన పార్లమెంట్ సమావేశాలు

**మొదటిపేజీ తరువాయి**

అడ్డుకోవడం, పాడకుండా నిరోధించడం నేరంగా పరిగణించేలా కొత్త చట్టం తీసుకొచ్చారు.కేంద్ర హోంశాఖ జనవరి 28న 'వందేమాతరం' ఆలాపనపై మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్రపతి రాక, త్రివర్ణ పతాక ఆవిష్కరణ, గవర్నర్ల ప్రసంగాలు వంటి సందర్భాల్లో ఆరు చరణాలు ఆలపించాలని అందులో సూచించింది.అయితే వర్షాకాల సమావేశాలు మాత్రం తీవ్ర రాజకీయ వేడితో సాగాయి. జులై 20న సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి పలు అంశాలపై అధికార, విపక్షాల మధ్య వాగ్వాదాలు జరిగాయి. సభా కార్యక్రమాలు పలుసార్లు స్తంభించాయి.చివరి రోజు కూడా విపక్ష సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్లమెంట్ ప్రాంగణంలోని మకర ద్వారం వద్ద బీజేపీ, విపక్షాలు వేర్వేరుగా నిరసనలు చేపట్టాయి. ఈ గందరగోళం మధ్యే 'వందేమాతరం'తో సభ ప్రారంభం కావడం ఈ సమావేశాల చివరి రోజుకు ప్రత్యేక గుర్తింపుగా నిలిచింది.నీట్‌పేపర్ లీక్ వ్యవహారంపై సమగ్ర చర్చకు సిద్ధమని బుధవారం అమిత్‌షా పార్లమెంటులో మీడియాతో పేర్కొన్నారు. ఈ అంశంపై చర్చకు సమయాన్ని పెంచేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. అయితే నిరసనకారులపై కాల్పులు, పోలీసుల దాడికి ఎవరు ఆదేశాలిచ్చారనే దానిపై యువతకు సమాధానం కావాలని, అమిత్‌షా ఇచ్చే ప్రసంగం కాదని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చర్చ ప్రతిపాదనను తిరస్కరించారు.'గనులు మరియు ఖనిజాల (అభివృద్ధి మరియు నియంత్రణ) సవరణ చట్టం'కు సవరణలు చేసే బిల్లును లోక్‌సభ బుధవారం ఎటువంటి చర్చా లేకుండానే ఆమోదించింది. రాజ్యసభ మరో రెండు బిల్లులను 'జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (సవరణ) బిల్లు, 2026' 'కేరళ (పేరు మార్పు) బిల్లు, 2026'ను ఆమోదించింది.

# త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు

**మొదటిపేజీ తరువాయి**

ధరలను పెంచలేదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అదే విధంగా సిమెంట్, స్టీల్ వంటి రంగాలకు సంబంధించిన ధరల విషయంలోనూ పెరుగుదలను నియంత్రించే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మినరల్స్ అంశంలో రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం పెత్తనం చేయబోదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. పన్నులు, సెస్‌ల విషయంలోనూ కేంద్రం జోక్యం చేసుకోదని తెలిపారు. రాష్ట్రాలకు ఉన్న హక్కులు, అధికారాలను గౌరవిస్తూనే ఖనిజ రంగ అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని చెప్పారు. దేశంలో మినరల్స్ ఉత్పత్తిని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని కిషన్‌రెడ్డి తెలిపారు.

------

# గోరింటాకు.. తెలంగాణ సంస్కృతికి ప్రతీక

## నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గోరింటాకు సంబరాలు






**నర్సంపేట/ ఆగస్టు 13 (జర్నలిస్ వార్త):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు గోరింటాకు ప్రతీకగా నిలుస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ అన్నారు. కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో బుధవారం గోరింటాకు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బతుకమ్మ, బోనాలు, పెళ్లిళ్లు, పేరంటాలు, పండుగలు, శుభకార్యాల్లో గోరింటాకు పెట్టుకోవడం తెలంగాణలో తరతరాలుగా వస్తున్న సంప్రదాయమన్నారు. గోరింటాకు కేవలం అలంకరణ మాత్రమే కాకుండా ఆనందం, శుభం, ఆత్మీయత, కుటుంబ బంధాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. సంప్రదాయాల వెనుక ఉన్న సామాజిక, సాంస్కృతిక, శాస్త్రీయ అంశాలను విద్యార్థులు తెలుసుకోవాలని సూచించారు.

మహిళా సాధికారత విభాగం అధ్యక్షురాలు ఎస్.రజిత మాట్లాడుతూ ఆధునిక జీవనశైలిలో కనుమరుగవుతున్న సంప్రదాయాలను యువతకు పరిచయం చేసి, భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ డి.సంధ్య మాట్లాడుతూ గోరింటాకు వెనుక శాస్త్రీయత కూడా ఉందన్నారు. గోరింటాకు ఆకుల్లోని 'లాసోన్' అనే సహజ వర్ణద్రవ్యం చర్మంలోని కెరాటిన్‌తో బంధం ఏర్పరచుకోవడం వల్ల చేతులకు సహజమైన ఎరుపుగోధుమ రంగు వస్తుందని వివరించారు. రసాయనాలు కలిపిన బ్లాక్ హెన్నాకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ బి.గాయత్రి, ఏవో అనిత, అధ్యాపకులు మాధవి, గ్లోరీతోపాటు అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ ఫిర్యాదు

## ఉపాధ్యాయుడిపై వేధింపుల ఆరోపణలు



**కామేపల్లి/ ఆగస్టు 13 (జర్నలిస్ వార్త):** కామేపల్లి మండలం ముచ్చర్ల ఎంపీపీ పాఠశాలలో ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తున్న గొలుసు సింధు, అదే పాఠశాలలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆమడల ప్రసాద్‌పై వేధింపుల ఆరోపణలు చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. తన విధులకు ఆటంకం కలిగిస్తూ అనుచితంగా వ్యవహరిస్తున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఫిర్యాదు వివరాల ప్రకారం.. ప్రసాద్ తన భార్యకు ఉద్యోగం ఇప్పించాలనే ఉద్దేశంతో తనపై ఒత్తిడి తెస్తున్నారని సింధు ఆరోపించారు. తరగతి గదిలోకి వచ్చి తన అనుమతి లేకుండా సెల్‌ఫోన్‌తో ఫొటోలు, వీడియోలు తీస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద తనపై ప్రతికూల ప్రచారం చేయడంతోపాటు, తన తరగతిలోని పిల్లలను ఇతర తరగతులకు తరలిస్తున్నారని ఆరోపించారు. గత నెల రోజులుగా ఈ పరిణామాలు కొనసాగుతున్నాయని, దీంతో విధులు నిర్వహించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని సింధు ఫిర్యాదులో పేర్కొన్నారు. తన ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి, ఇరుపక్షాల వాదనలు నమోదు చేసి వాస్తవాలను నిర్ధారించాలని ఆమె కోరారు. విచారణలో ఆరోపణలు రుజువైతే సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, విచారణ పూర్తయ్యే వరకు తన విధులకు ఎలాంటి ఆటంకం కలగకుండా అవసరమైన రక్షణ కల్పించాలని విద్యాశాఖ అధికారులను విజ్ఞప్తి చేశారు. వివరణ కోసం ప్రయత్నించగా.. సంబంధిత ఉపాధ్యాయుడు ఆమడల ప్రసాద్ వివరణ అందుబాటులోకి రాలేదు. ఆరోపణలు నిర్ధారణ కావాల్సి ఉంది.

# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

## పీఆర్సీ ప్రకటించి డీఏలు మంజూరు చేయాలి




**హసన్‌పర్తి/ ఆగస్టు 13 (జర్నలిస్ వార్త):** ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల నాయకులు గురువారం మండల డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర స్టీరింగ్ కమిటీ పిలుపు మేరకు యూటీఎఫ్, డీటీఎఫ్, టీపీటీఎఫ్, టీటీయూ, ఎస్-ఎస్ఏ ఉద్యోగులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ డాక్టర్ మోడెం సారంగపాణి మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. వెంటనే పీఆర్సీని ప్రకటించి పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షురాలు రమాదేవి, ప్రధాన కార్యదర్శి టి.నరేష్, డీటీఎఫ్ మండల అధ్యక్షుడు టి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామచంద్రు, డీటీయూ మండల అధ్యక్షుడు గుర్రం శ్రీనివాస్, ఎస్ఎస్ఏ ఉద్యోగులు అనిల్, భార్గవి, డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు బి.అంజనీదేవి తదితరులు పాల్గొన్నారు.

# మహిళల సంక్షేమమే లక్ష్యం

## అర్హులందరికీ ఇందిరమ్మ మహిళా శక్తి చీరలు: ఎమ్మెల్యే నాగరాజు





**హసన్‌పర్తి/ఆగస్టు 13 (జర్నలిస్ వార్త):** మహిళల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. హసన్‌పర్తి మండలం ఎర్రగట్టుగుట్ట సమీపంలోని అమిత్ గార్డెన్స్‌లో గురువారం 'మహిళా ఉన్నతితెలంగాణ ప్రగతి' పేరిట ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే 1వ డివిజన్‌కు చెందిన మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ మహిళా శక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంపు, నూతన రేషన్ కార్డుల మంజూరు వంటి పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక, విద్యా, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. అర్హులైన మహిళలందరికీ ఇందిరమ్మ మహిళా శక్తి చీరలు అందిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు చిర్ర రాము, గడ్డం అరుణ్, కొంకా హరిబాబు, గొర్రె కిరణ్, మార్కెట్ డైరెక్టర్ రైతు రాజు, పీఏసీఎస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు విసం సురేందర్‌రెడ్డి, వెంకన్న, కనుపర్తి కిరణ్, రవి యాదవ్, నాయకులు, మహిళలు, అధికారులు పాల్గొన్నారు.

# బిల్లుపాడులో ఘనంగా బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం

## విద్యార్థులకు అల్పాహారం పంపిణీ

**తల్లాడ/ఆగస్టు 13 (జర్నలిస్ వార్త):** తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని సర్పంచ్ ఎన్నిక కృష్ణవేణి గురువారం ప్రారంభించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉదయమే



అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టడం అభినందనీయమన్నారు. పౌష్టికాహారం తీసుకుంటే విద్యార్థులు ఆరోగ్యంగా ఉండటంతోపాటు చదువుపై మరింత ఏకాగ్రత సాధిస్తారని పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జక్కంపూడి కిషోర్, సామినేని రామప్పారావు, జక్కంపూడి రమేష్, బత్తుల రాందాస్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 10,814 కోట్ల బకాయిలు విడుదల చేయాలి

## ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కోసం ఎస్ఎఫ్ఐ ధర్నా






**హనుమకొండ బ్యూరో ఆగస్టు 13 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్, జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే విధంగా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విడుదలలో తీవ్ర జాప్యం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.10,814 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని, వీటి ప్రభావంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన సుమారు 14 లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బకాయిలు విడుదల కాకపోవడంతో కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని ఆరోపించారు. విద్యార్థుల సర్టిఫికెట్లు నిలిపివేసే విద్యాసంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కళాశాలలు, హాస్టళ్లలో విద్యార్థులపై పడుతున్న ఆర్థిక భారాన్ని కూడా తగ్గించాలని కోరారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శిస్తూ ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి రేవంత్‌రెడ్డి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు చేపట్టాలని, లేకపోతే విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్, జిల్లా సహాయ కార్యదర్శి బిరెడ్డి జశ్వంత్, జిల్లా కమిటీ సభ్యులు బొచ్చు ఈశ్వర్, బొజ్జ హేమంత్, చెన్నూరి సాయికుమార్, పవన్‌కుమార్, సాల్మన్‌రాజు, రాహుల్, రేగుల భానుప్రసాద్, మంద మణిదీప్, రాజ్, కుమార్ ప్రశాంత్, సందీప్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# గిరిజన సంస్కృతికి తీజ్ ప్రతీక

## తీజ్ వేడుకల్లో ఎమ్మెల్యే బీఎల్ఆర్





**మిర్యాలగూడ/ఆగస్టు 13 (జర్నలిస్ వార్త):** గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) అన్నారు. మిర్యాలగూడ మండలం ఐలాపురం గ్రామంలో గిరిజనులు సంప్రదాయబద్ధంగా నిర్వహించిన తీజ్ పండుగ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలు, యువతీ యువకులు నిర్వహించిన తీజ్ వేడుకలను ఎమ్మెల్యే ఆసక్తిగా తిలకించారు. తీజ్ పండుగ గిరిజనుల జీవన విధానంలో ప్రత్యేక ప్రాధాన్యం కలిగిందని, ఇలాంటి సంప్రదాయ వేడుకలు గిరిజనుల ఐక్యతను, సంస్కృతిని ప్రతిబింబిస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న ఆచారాలు, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం గ్రామ ప్రజలకు, గిరిజన సోదర సోదరీమణులకు తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన పెద్దలు, మహిళలు, యువత, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నర్సంపేటలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటుదాం: డా. గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి




**నర్సంపేట/ఆగస్టు 13 (జర్నలిస్ వార్త):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు భారతీయ జనతా పార్టీ నర్సంపేట నియోజకవర్గం ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీని గురువారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రివర్ణ పతాకం దేశ ప్రజల ఐక్యతకు, త్యాగాలకు ప్రతీక అని అన్నారు. స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్, నేతాజీ సుభాష్‌చంద్రబోస్ తదితరులు చేసిన పోరాట స్ఫూర్తి జాతీయ జెండాలో ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. జాతీయ జెండా కేవలం మూడు రంగుల వస్త్రం కాదని, కోట్లాది భారతీయుల త్యాగాలకు ప్రతీక అని అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం బీజేపీకి మాత్రమే పరిమితమైన కార్యక్రమం కాదని, దేశంలోని ప్రతి ఒక్కరి కార్యక్రమమని తెలిపారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చదువుతోపాటు దేశంపై ప్రేమ, బాధ్యతాభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సరిహద్దుల్లో దేశ రక్షణ కోసం సైనికులు చేస్తున్న సేవలను గుర్తు చేసుకుంటూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి వారికి గౌరవం చాటాలని కోరారు. ర్యాలీలో ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, విద్యార్థులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక



# ముదిరాజ్ స్మశానవాటికకు విద్యుత్ సౌకర్యం

## పెద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలని వినతి



**హసన్‌పర్తి/ఆగస్టు 13 (జర్నలిస్ వార్త):** హసన్‌పర్తి 66వ డివిజన్‌లోని ముదిరాజ్ స్మశానవాటికకు విద్యుత్ లైన్ ఏర్పాటు చేయడంతోపాటు పెద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరుతూ విద్యుత్ శాఖ ఏఈ హరీష్‌కు కాంగ్రెస్ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సహకారంతో స్మశానవాటికకు విద్యుత్ స్తంభాలు మంజూరైనట్లు కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు గొర్రె కిరణ్‌కుమార్ తెలిపారు. దహన సంస్కారాల సమయంలో విద్యుత్ సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి విద్యుత్ స్తంభాలు మంజూరు చేయించారని పేర్కొన్నారు.స్మశానవాటిక జాతీయ రహదారిని ఆనుకుని ఉండటంతో రాత్రివేళల్లో దహన సంస్కారాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని పెద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలని ఏఈని కోరినట్లు తెలిపారు.కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మాజీ అధ్యక్షుడు పెద్దమ్మ నరసింహారావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టిసి బస్ ఢీ కొని ఆటో డ్రైవర్ మృతి.

## -కేసు నమోదు చేసిన ఎస్ఐ ప్రశాంత్ బాబు.




**బయ్యారం,ఆగస్టు 13.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండలంలోని చెరువు ముందు కొత్తగూడెం గ్రామానికి చెందిన ఎట్టి సాయి (21) ఆటో ప్రమాదం లో బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ ప్రశాంత్ బాబు తెలిపారు.ఈ సందర్భంగా మృతుడు సాయి బుధవారం సాయంత్రం కొత్తపేట సమీపంలోని పెట్రోల్ బంక్‌లో తన ఆటో డీజిల్ పోయించుకునేందుకు డ్రైవింగ్ చేసుకుంటూ వెళ్తుండగా, ఎదురుగా ఇల్లందు వైపు నుండి మహబూబాబాద్ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఇమ్మడి వెంకటేశ్వర్లు బస్సును అతివేగంగా,అజాగ్రత్తగా నడుపుతూ ఆటోను ఢీకొట్టినట్లు తెలిపారు.ప్రమాదంలో ఎట్టి సాయికి తలకు,ఛాతి భాగాల్లో తీవ్ర గాయాలు కావడంతో వెంటనే అంబులెన్స్ ద్వారా మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృత్యువాత పడినట్లు తెలిపారు.మృతుడి తండ్రి ఎట్టి రాములు గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యం





**ఐనవోలు/ ఆగస్టు 13(జర్నలిస్ట్ వార్త);** రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు పనిచేయాలని ఐనవోలు మండల అధ్యక్షుడు నకరకంటి మోహన్‌గౌడ్ పిలుపునిచ్చారు. పంతిని, కక్కిరాలపల్లి, పున్నేలు, ఒంటిమామిడిపల్లి గ్రామాల్లో గురువారం నూతన కాంగ్రెస్ గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మోహన్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామ కమిటీలే పార్టీకి బలమైన పునాదులన్నారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మత్తుకు యువత దూరంగా ఉండాలి

## జమ్మికుంట కళాశాలలో పోలీసుల అవగాహన



**జమ్మికుంట/ ఆగస్టు 13 (జర్నలిస్ వార్త):** మాదకద్రవ్యాల మత్తులో పడి యువత భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని జమ్మికుంట ఎస్సై జె. రవి హెచ్చరించారు. డ్రగ్స్, గంజాయి, సిగరెట్లు తదితర మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు.జమ్మికుంట పట్టణంలోని డిగ్రీ, పీజీ కళాశాల ఆవరణలో బుధవారం మాదకద్రవ్యాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. చెడు స్నేహాలు, సరదా, ఇతరుల ప్రేరణతో యువత మత్తు పదార్థాలకు అలవాటుపడే ప్రమాదం ఉందన్నారు. ఒక్కసారి వ్యసనానికి బానిసైతే చదువు, ఆరోగ్యం, కుటుంబ సంబంధాలు దెబ్బతినడంతోపాటు భవిష్యత్తు అంధకారంగా మారుతుందని పేర్కొన్నారు.విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారని తెలిపారు.
అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసి, మాదకద్రవ్యాలకు సంబంధించిన చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఓవర్‌లోడ్ ట్రాన్స్‌ఫార్మర్‌తో రైతులకు తిప్పలు

## కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని వినతి



**జమ్మికుంట/ఆగస్టు 13 (జర్నలిస్ వార్త):** వెంకటేశ్వర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గోవిందపూర్‌లో వాగును ఆనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఓవర్‌లోడ్‌తో కొట్టుమిట్టాడుతోంది. సామర్థ్యానికి మించి వ్యవసాయ మోటార్ల భారం పడటంతో ఎప్పుడు ఏ సమస్య వస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే పంటలకు తీవ్ర ఇబ్బందులు తప్పవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యపై గ్రామపంచాయతీ 3వ వార్డు సభ్యుడు బండారి ప్రశాంత్ స్పందించారు. జమ్మికుంట విద్యుత్ అధికారులను కలిసి వినతిపత్రం అందజేసి, రైతుల ఇబ్బందులను వివరించారు. ప్రస్తుత ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం సరిపోకపోవడంతో వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా అధిక సామర్థ్యం కలిగిన కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను తాత్సారం చేయకుండా తక్షణమే చర్యలు తీసుకుని రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని కోరారు.వినతిపై స్పందించిన విద్యుత్ అధికారులు సమస్యను పరిశీలించి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, ప్రజా సేవే బాధ్యతగా పనిచేస్తున్నామని బండారి ప్రశాంత్ తెలిపారు.

# ఎస్టి బాలుర హాస్టల్ తనిఖీ.

## -తహసీల్దార్ నాగరాజు






**బయ్యారం/,ఆగస్టు 13.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండలంలోని జగ్గు తాండ పంచాయతీ పరిధిలో ఎస్టి బాలుర హాస్టల్ ను మండల తహశీల్దార్ నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ పరిసరాల పరిశుభ్రత,మౌళిక వసతులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.భోజనం మెనూ ప్రకారం అందుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లో ఏమైనా సమస్యలు వస్తే ఫిర్యాదు బాక్సులో ఫిర్యాదు రాసి ఉంచాలని కోరారు.ఇతర కంప్లైంట్ కొరకు బ్యానర్ పై ఉన్న అధికారులు ఫోన్ నెంబర్ కు సమాచారం అందించాలని విద్యార్థులను కోరారు. సీజనల్ వ్యాధులు రాకుండా, ముందస్తు చర్యలు చేపట్టాలని వార్డెన్ ను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి,తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారిని ఆశీర్వదించిన మువ్వా విజయబాబు



**ఖమ్మం/ ఆగస్టు 13 (జర్నలిస్ వార్త):** మీకీలినేని నాగరాజునాగిని దంపతుల మనవడి 21వ రోజు కార్యక్రమానికి రాష్ట్ర ఇరిగేషన్ శాఖ చైర్మన్ మువ్వా విజయబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారిని ఆశీర్వదించి, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో జక్కంపూడి రాము, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఆత్మీయులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి, మువ్వా అభిమానులు పాల్గొన్నారు.

# జిల్లా సహకార అధికారిపై కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులు తక్షణమే ఉపసంహరించుకోవాలి.

## -బిఆర్ఎస్ పార్టీ నాయకుల డిమాండ్.





**బయ్యారం/,ఆగస్టు 13.(జర్నలిస్ట్ వార్త)** మహబూబాబాద్ జిల్లా సహకార సంఘ జిల్లా అధికారి విజయ కుమారి విధులు పట్ల నిర్లక్ష్యం వహించారని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ రాష్ట్ర వ్యవసాయ,సహకార శాఖకు డిసిఓను సరెండర్ చేయడాన్ని నిరసిస్తూ బయ్యారం మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయ ఆవరణలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తాతా గణేష్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ రైతు సంఘ నాయకులు ఏనుగుల ఐలయ్య తదితరులు మాట్లాడుతూ బయ్యారం సొసైటీ చైర్మన్ గా పని చేసిన మూల మధుకర్ రెడ్డి కి భూమిలేదని అధికారుల ధ్రువీకరణతో జిల్లా కలెక్టర్ ఆదేశానుసారమే జిల్లా డిసిఓ విజయ కుమారి సొసైటీ మాజీ చైర్మన్ పై చర్యలు తీసుకోవడం జరిగిందని,అలాంటప్పుడు జిల్లా డిసిఓపై కక్షపూరితంగా వారి విధులను తప్పుపడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో జిల్లా కలెక్టర్ డిసిఓ విజయ కుమారిని రాష్ట్ర సహకార కమిషనరేట్ కు సరెండర్ చేయడం ఏమిటని నాయకుల ప్రశ్నించారు.వెంటనే కలెక్టర్ తమ నిర్ణయాన్ని పునఃసమీక్షించి డిసిఓను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గురిమెల్ల సర్పంచ్ భద్రయ్య,బాల్యతండా సర్పంచ్ దేవోజీ,వెంకట్రాంపురం సర్పంచ్ శివాజీ, నాయకులు లక్ష్మణ్ నాయక్,మురళి కృష్ణ,శ్రీనివాస్ నాయక్,సత్యనారాయణ,జరుపుల శ్రీనివాస్,రేపాకుల వెంకన్న,శ్రీకాంత్,ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# 329 మంది విద్యార్థులకు ఉచిత యూనిఫాంలు





**వేలేరు/ఆగస్టు 13( జర్నలిస్ట్ వార్త)** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న నూతన యూనిఫాంలను వేలేరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేశారు. మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, వేలేరు సర్పంచ్ బిల్లా యాదగిరి, ఎంపీడీవో కిషన్‌నాయక్ ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు యూనిఫాంలు అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నాణ్యమైన యూనిఫాంలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. యూనిఫాంల కుట్టు బాధ్యతలను స్థానిక మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించడం ద్వారా వారికి ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా చదువుకోవాలని సూచించారు. వేలేరు ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న 329 మంది విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేసినట్లు తెలిపారు.కార్యక్రమంలో ఎంఈవో చంద్రమౌళి, ఎంపీవో బుచ్చిరెడ్డి, ఏపీఎం అనిత, పంచాయతీ కార్యదర్శి విజయ, ప్రధానోపాధ్యాయులు సత్యం, లీలాబాయి, సీసీ రమాదేవి, నాలుగు వీవోల అధ్యక్షులు, సీఏలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 16 కుటుంబాల్లో వెలుగులు

**కారుణ్య నియామకాల ప్రక్రియ పూర్తి**

**16 మందికి రోస్టర్ ప్రకారం పోస్టుల కేటాయింపు**

**కలెక్టర్ స్నేహ శబరీష్‌కు అభ్యర్థుల కృతజ్ఞతలు**



**మహబూబాబాద్/ఆగస్టు 13 (జర్నలిస్ వార్త):** కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న 16 కుటుంబాలకు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అండగా నిలిచారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన 16 మందికి ఉద్యోగాలు కల్పించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో రోస్టర్ పద్ధతిలో పారదర్శకంగా పోస్టులను కేటాయించారు.

**ఆలస్యం చేయకుండా నియామకాలు**

విధి నిర్వహణలో ఉండగా మృతి చెందిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. అర్హులకు సకాలంలో న్యాయం చేయాలనే ఉద్దేశంతో నియామకాల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసినట్లు తెలిపారు. కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్న వారు నిబద్ధత, జవాబుదారీతనంతో విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

**రోస్టర్ ప్రకారం పోస్టులు:** 16 మంది అభ్యర్థులకు రోస్టర్ పాయింట్ల ఆధారంగా వివిధ శాఖల్లో పోస్టులు కేటాయించారు. రెవెన్యూ శాఖలో ఐదుగురికి జూనియర్ అసిస్టెంట్, ఆరుగురికి అటెండర్ పోస్టులు కేటాయించగా.. ఇతర శాఖల్లో జూనియర్ అసిస్టెంట్, అటెండర్ కేడర్లలో మరో ఐదు పోస్టులు కేటాయించారు.

**కలెక్టర్‌కు కృతజ్ఞతలు**

తమ కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో ఉద్యోగాలు కల్పించి ఆదుకున్నందుకు అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మోరా మమత, వజ్జ రజిత, ఇస్లావత్ శ్వేత, ధనసరి రమణ తదితరులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్‌కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి నాగలక్ష్మి, కలెక్టరేట్ పరిపాలనాధికారి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ఓటర్లను జాబితాలో చేర్చాలి

**సేకరించని ఎన్యూమరేషన్ ఫారాల వివరాలు ఇవ్వాలి: మహమ్మద్ అయూబ్**



**హసన్‌పర్తి/ ఆగస్టు 13 (జర్నలిస్ వార్త):** అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా ఓటర్ల జాబితాలో చోటు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, బీఎల్ఏ1 మహమ్మద్ అయూబ్ కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో సేకరించని, 'అన్‌కలెక్టబుల్'గా గుర్తించిన ఎన్యూమరేషన్ ఫారాల వివరాలు అందించాలని కోరుతూ బుధవారం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సత్యశారదకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా అయూబ్ మాట్లాడుతూ ఎన్యూమరేషన్ ఫారం సమర్పించలేదనే కారణంతో అర్హత కలిగిన ఓటరు ముసాయిదా జాబితాలో చోటు కోల్పోకూడదన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ స్టేషన్ వారీగా సేకరించని ఎన్యూమరేషన్ ఫారాల జాబితా, వాటిని 'అన్‌కలెక్టబుల్'గా గుర్తించడానికి గల కారణాలు, నిబంధనల మేరకు అందుబాటులో ఉన్న ఓటర్ల సంప్రదింపు వివరాలను ఇవ్వాలని కోరారు. ఈ వివరాల ఆధారంగా కాంగ్రెస్ బీఎల్ఏలు, ప్రతినిధులు క్షేత్రస్థాయిలో ఓటర్లను గుర్తించి, క్లెయిమ్స్, అభ్యంతరాల ప్రక్రియపై అవగాహన కల్పిస్తారని తెలిపారు.అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా, లోపాలు లేకుండా పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపొందించేందుకు ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ పార్టీ సహకరిస్తుందని అయూబ్ స్పష్టం చేశారు.

# 95-95-95 లక్ష్యాలే కీలకం



**మహబూబాబాద్/ఆగస్టు 13 (జర్నలిస్ట్ వార్త):** హెచ్ఐవీ నియంత్రణలో భాగంగా జిల్లాకు నిర్దేశించిన 95-95-95 లక్ష్యాలను సాధించేందుకు సమష్టిగా కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రవి రాథోడ్ సూచించారు. కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం 'దిశా' మాస సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఐసీటీసీ కౌన్సిలర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల పనితీరును సమీక్షించారు. హెచ్ఐవీ అనుమానితులు, బాధితులను త్వరగా గుర్తించి పరీక్షలు నిర్వహించాలని డీఎంహెచ్ఓ సూచించారు. హెచ్ఐవీ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన ప్రతి ఒక్కరికీ ఏఆర్టీ చికిత్స అందేలా ఎంజీఎం ఆసుపత్రికి పంపించాలన్నారు. ఏఆర్టీ మందులు వినియోగిస్తున్న వారందరికీ ఏడాదికి ఒకసారి తప్పనిసరిగా వైరల్ లోడ్ పరీక్షలు నిర్వహించాలని తెలిపారు.95-95-95 లక్ష్యాలను సాధిస్తేనే రాష్ట్రస్థాయిలో మహబూబాబాద్ జిల్లాను సురక్షిత జిల్లాగా నిలపగలమని పేర్కొన్నారు. సమావేశంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అర్జున్, దిశా సిబ్బంది, జిల్లా సహాయోగి, ఐసీటీసీ కౌన్సిలర్లు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కరుణామయిత్రి పాజిటివ్ పీపుల్ నెట్‌వర్క్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో తల్లాడ పంచాయతీ ముందంజ

## వైరా చెరువు నుంచి ప్రత్యేక పైప్‌లైన్‌తో తాగునీటి సరఫరా




**తల్లాడ/ ఆగస్టు 13 (జర్నలిస్ వార్త):** గ్రామాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ తల్లాడ గ్రామపంచాయతీ ముందుకు సాగుతోంది. పారిశుధ్య నిర్వహణలో భాగంగా పిచ్చి మొక్కలకు గడ్డి మందు పిచికారీ చేయడంతో పాటు దోమల నివారణకు కింగ్‌ఫాగ్ ద్వారా దోమల మందు పిచికారీ చేస్తున్నారు. మురుగు కాలువలకు మరమ్మతులు చేపట్టి పారిశుధ్య సమస్యలను పరిష్కరిస్తున్నారు.ఇటీవల మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో గ్రామపంచాయతీ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా వైరా చెరువు నుంచి తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. దీంతో గ్రామ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు చర్యలు చేపట్టారు.గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పంచాయతీ పాలకవర్గం పనిచేస్తోందని సర్పంచ్ పి. నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కె. లక్ష్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీహరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# శివలింగ ప్రతిష్ఠాపనకు శంకుస్థాపన

## నందీశ్వర విగ్రహానికి రూ.33,300 విరాళం



**కేసముద్రం/ ఆగస్టు 13 (జర్నలిస్ వార్త):** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ ధర్మశాస్త్ర ఆలయంలో త్రిశూల శివలింగ ప్రతిష్ఠాపన మహోత్సవానికి గురువారం శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
స్వామివారి వాహనమైన నందీశ్వరుని శిలా విగ్రహం ఏర్పాటుకు జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి అంబటి మహేందర్‌రెడ్డి, లక్ష్మి దంపతులు రూ.33,300 నగదు విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందని వారు తెలిపారు. భక్తుల సహకారంతో ప్రతిష్ఠాపన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గంటా సంజీవరెడ్డి, ఆర్‌టీఏ మెంబర్ రావుల మురళి, ఆలయ కమిటీ బాధ్యులు పోలేపల్లి యాకుబ్‌రెడ్డి, ఓలం చంద్రుడు, బోగోజు నాగేశ్వరాచారి, కూరెల్లి సతీష్, ఏల్లగౌడ్, రుద్ర శ్రీకాంత్, కోయగురు యాకుబ్‌రెడ్డి, కొత్తపల్లి శేఖర్, శ్రీరామ్ కిరణ్, శ్రీరామ్ చంద్రన్, తంగళ్లపల్లి భాస్కర్, బండారు విజేందర్, రుద్ర సురేందర్ తదితరులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

# కేసముద్రంలో బోనాల సందడి

## 16న ముత్యాలమ్మ జాతర.. ఏర్పాట్లు పూర్తి



**కేసముద్రం/ ఆగస్టు 13 (జర్నలిస్ వార్త):** కేసముద్రం మున్సిపాలిటీలో బోనాల జాతరకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల 16న నిర్వహించనున్న ముత్యాలమ్మ అమ్మవారి బోనాల జాతరను వైభవంగా నిర్వహించేందుకు మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న, వైస్ చైర్‌పర్సన్ అల్లం రమ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు.తెలంగాణ పల్లె సంస్కృతి ప్రతిబింబించేలా జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పోతురాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్లు, ఒగ్గుడోలు, మహిళా కోలాటం, బోనాల కోలాటం, చిందు యక్షగానం, శివశక్తుల ప్రదర్శనలు భక్తులను అలరించనున్నాయి. ఘటాల ఊరేగింపు, శివసత్తుల పూనకాలు, అమ్మవారికి నైవేద్యాల సమర్పణ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా తాగునీరు, నీడతోపాటు అవసరమైన మున్సిపల్ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు సంప్రదాయ దుస్తుల్లో బోనాలతో పెద్ద సంఖ్యలో తరలివచ్చి జాతరను విజయవంతం చేయాలని చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ కోరారు.

# ఖర్గేకు అవమానంపై కాంగ్రెస్ కదం

## రేపు వరంగల్‌లో భారీ యాత్ర.. కాశీబుగ్గలో సత్యాగ్రహం



**వరంగల్/ఆగస్టు 13(జర్నలిస్ట్ వార్త):** ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పట్ల ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో జరిగినట్లు ఆరోపిస్తున్న వివక్షపూరిత, అవమానకర చర్యను నిరసిస్తూ వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ యాత్ర, సత్యాగ్రహం నిర్వహించనున్నట్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ తెలిపారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు చేపడుతున్న ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వెంకట్రామ జంక్షన్ నుంచి భారీ నిరసన యాత్ర ప్రారంభమై కాశీబుగ్గలోని అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుంటుందని, అక్కడ సత్యాగ్రహం నిర్వహిస్తామని అయూబ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడికి సంఘీభావం ప్రకటించడంతో పాటు రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం పరిరక్షణకు తమ నిబద్ధతను చాటేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా పరిధిలోని పీసీసీ సభ్యులు, డీసీసీ కమిటీ సభ్యులు, మండల, పట్టణ, డివిజన్ కాంగ్రెస్ కమిటీల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా యాత్రకు హాజరు కావాలని టీపీసీసీ ఆదేశించిందన్నారు. కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మహమ్మద్ అయూబ్ కోరారు.

**యాత్ర ఇలా..ప్రారంభం: వెంకట్రామ జంక్షన్సమయం: శుక్రవారం సాయంత్రం 4 గంటలకు**
**ముగింపు: కాశీబుగ్గ అంబేద్కర్ విగ్రహంకార్యక్రమం: సత్యాగ్రహం**

# ప్రభుత్వ బడుల అభివృద్ధికి కృషి

## ఎల్లాపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ








**హసన్‌పర్తి/ఆగస్టు 13 (జర్నలిస్ వార్త):** ప్రభుత్వ పాఠశాలలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు అన్నారు. గ్రేటర్ వరంగల్ 65వ డివిజన్ పరిధిలోని ఎల్లాపూర్ జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు గురువారం ఆయన క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్క నాటారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. పాఠశాల అభివృద్ధిలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో 65వ డివిజన్ అధ్యక్షుడు సునీల్, ఎల్లాపూర్ గ్రామ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఆత్మకూరు మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రాకేష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అశోక్, మాజీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ అరుణ, భిక్షపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్‌రెడ్డి, 66వ డివిజన్ అధ్యక్షుడు గౌరె కిరణ్, మహిళా ఉపాధ్యక్షురాలు స్వాతి, మాజీ ఎంపీటీసీ సుదర్శన్, సీనియర్ నాయకులు ప్రకాష్, మధుసూదన్‌రెడ్డి, కుమారస్వామి, అశోక్, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ ఎన్నిక



**సంగ్యెం/ఆగస్టు 13(జర్నలిస్ట్ వార్త):** మొండ్రాయి గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షుడిగా వేల్పుల కుమారస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పరికి మోహన్, ప్రచార కార్యదర్శిగా పరికి రాజు, సహాయ కార్యదర్శిగా వేల్పుల చిరంజీవి, ఆర్గనైజర్‌గా పరికి నరసయ్య, కోశాధికారిగా పరికి ప్రతాప్, గేమ్స్ సెక్రెటరీగా చాతల్ల అంజయ్యలను ఎంపిక చేశారు.
సంఘం సలహాదారులుగా పరికి ఏలియా, పరికి రాములు, వేల్పుల సూరయ్య, వేల్పుల భద్రయ్య, పరికి కిషన్, పరికి దయాకర్, పరికి స్వామిలను నియమించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చాతల్ల రమేష్ మాదిగ, ఎంఆర్‌పీఎస్ గ్రామ అధ్యక్షుడు వేల్పుల ప్రభాకర్ మాదిగ, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు పరికి యాకయ్య, వార్డు సభ్యుడు వేల్పుల ప్రశాంత్, అంబేద్కర్ యువజన సంఘం మాజీ అధ్యక్షుడు పరికి రాజు, సంఘం సభ్యులు పరికి హరికృష్ణ, చాతల్ల అంజయ్య, వేల్పుల రమేష్, వేల్పుల బాబు, వేల్పుల సంపత్, చాతల్ల నవీన్, చిన్నబాబు, వేల్పుల ప్రణీత్, ప్రదీప్, జ్యోతి, స్వరూప్, పరికి ఉమేష్, వేల్పుల అన్వేష్, చాతల్ల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలపై తక్షణ నిర్ణయాలు

**హనుమకొండ/ఆగస్టు 13(జర్నలిస్ట్ వార్త):** ఆగస్టు 14న జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన పెండింగ్ సమస్యలపై చర్చించి తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మరుపట్ల మల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యంగా వేతన సవరణ సంఘం నివేదిక, వేతన సవరణ అమలు అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.గత ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు రావాల్సిన వేతన సవరణను ప్రకటించకుండా కేవలం ఐదు శాతం మధ్యంతర భృతి ఇచ్చి చేతులు దులుపుకొందని మల్లయ్య విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఉద్యోగుల సమస్యలన్నింటినీ ఆరు నెలల్లో పరిష్కరిస్తామని, వేతన సవరణను ప్రకటిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు గడుస్తున్నా వేతన సవరణ అమలులో జాప్యం కొనసాగడం ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తికి కారణమవుతోందన్నారు. వేతన సవరణ గడువు ముగిసే పరిస్థితి నెలకొంటున్నందున ప్రభుత్వం ఇక ఆలస్యం చేయకుండా తక్షణమే నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు 40 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణను ప్రకటించాలని మల్లయ్య డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి మంత్రివర్గ సమావేశంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.

# వరంగల్ పోలీస్ అధికారుల సంఘానికి కొత్త కార్యవర్గం

## కొండా కరుణాకర్‌కు అధ్యక్ష పగ్గాలు.. 17 ఓట్ల ఆధిక్యంతో విజయం

## 110 మంది అధికారుల ఓటింగ్.. పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ



**ధర్మసాగర్/ హనుమకొండ బ్యూరో ఆగస్టు 13 (జర్నలిస్టు వార్త):** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం రాణి రుద్రమదేవి ప్రాంగణంలో జరిగింది. ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ కొండా కరుణాకర్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ టి.బాబుపై 17 ఓట్ల ఆధిక్యంతో ఆయన విజయం సాధించారు.పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత ఐపీఎస్ ఆదేశాల మేరకు ఎన్నికల నోడల్ అధికారి అదనపు డీసీపీ ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు అదనపు డీసీపీ శ్రీనివాస్, ఏసీపీలు సదయ్య, నాగయ్య పర్యవేక్షించారు. వివిధ హోదాల్లో పనిచేస్తున్న 110 మంది పోలీస్ అధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల ప్రక్రియను పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత స్వయంగా పరిశీలించి, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.


### నూతన కార్యవర్గం

ఉపాధ్యక్షులుగా బి.సతీష్ (ఆర్ఐ), బి.శరత్‌కుమార్ (ఆర్ఎస్ఐ), ప్రధాన కార్యదర్శిగా ఇ.వీరభద్రరావు (దామెర ఎస్ఐ), సంయుక్త కార్యదర్శిగా టి.నరేష్ (కాజీపేట కానిస్టేబుల్), కార్యనిర్వహణ కార్యదర్శిగా ఎస్.ప్రవీణ్‌కుమార్ (ఏఆర్ కానిస్టేబుల్), కోశాధికారిగా బి.నరేష్ (పాలకుర్తి కానిస్టేబుల్) ఎన్నికయ్యారు.
కార్యనిర్వాహక సభ్యులుగా ఎం.తులసి (కాజీపేట మహిళా కానిస్టేబుల్), సీహెచ్. మహేందర్‌యాదవ్, ఏ.రమేష్ (ఏఆర్ కానిస్టేబుళ్లు), ఎన్.ప్రవీణ్ (సుబేదారి కానిస్టేబుల్), ఎండీ. తాజుద్దీన్ (హన్మకొండ ట్రాఫిక్ కానిస్టేబుల్), పి.సర్వేశ్ (పాలకుర్తి కానిస్టేబుల్) ఎన్నికయ్యారు.నూతన కార్యవర్గ సభ్యులను పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత ఐపీఎస్ అభినందించారు. పోలీస్ అధికారుల సంక్షేమం, సంఘం బలోపేతానికి నూతన కార్యవర్గం కృషి చేయాలని ఆకాంక్షించారు.



పోలీస్ అధికారుల సంఘం నూతన అధ్యక్షుడు కొండ కరుణాకర్



# ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం




**జమ్మికుంట/ ఆగస్టు 13 (జర్నలిస్ వార్త):** ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ధర్మారం ఒకటో వార్డు కౌన్సిలర్ పోలు దివ్యబిక్షపతి సూచించారు. స్వచ్ఛమైన గాలి పీల్చడం, తగినంత మంచినీరు తాగడం ద్వారా పలు అనారోగ్య సమస్యలను నివారించవచ్చన్నారు.

బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, జమ్మికుంట ఆదిత్యఅమృత మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సహకారంతో గురువారం ధర్మారం గ్రామంలోని ఒకటో వార్డు పాఠశాల ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కౌన్సిలర్ మాట్లాడారు.వైద్యులు డాక్టర్ భరత్, డాక్టర్ మహిపాల్ మాట్లాడుతూ ఎత్తు, వయసుకు తగిన బరువు ఉండేలా చూసుకోవాలని సూచించారు. అధిక బరువు, తక్కువ బరువు ఉన్నవారు ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలన్నారు. రోజువారీ జీవితంలో నడక, వ్యాయామానికి ప్రాధాన్యమివ్వాలని తెలిపారు.ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోలేని గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు ఉపయోగకరంగా ఉంటాయని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతి అన్నారు.

బాలవికాస జమ్మికుంట సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన మాట్లాడుతూ రిఫైన్డ్ నూనెల వినియోగాన్ని తగ్గించాలని, వేపుళ్లను వీలైనంత వరకు నివారించాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలను అతిగా ఉడికించకుండా తీసుకోవడం ద్వారా పోషక విలువలను కాపాడుకోవచ్చన్నారు. మహిళలు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటిస్తే కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు.నిరుపేదలకు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో బాలవికాస ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలకు తమ ఆసుపత్రి వైద్య బృందం సహకారం అందిస్తోందని ఆదిత్యఅమృత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత ఎలుక దేవేందర్‌రెడ్డి తెలిపారు. గ్రామీణులకు వైద్య సేవలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్ కే. సుమలత, రెండో వార్డు కౌన్సిలర్ పోల్నేని వేణుగోపాలరావు, ఆసుపత్రి పీఆర్‌ఓలు రఫీక్, దుర్గాప్రసాద్, సిబ్బంది అనిల్‌రావు, మహేష్, శ్రావణ్, రంజిత్, పూజ, సంతోషిని, సుచిత్ర, వార్డు సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

# ఇవాళ జైలులో నన్ను కూడా అవమానించారు: జగన్

### కర్నూలు జైలులో ఎమ్మెల్యే విరూపాక్షిని పరామర్శించిన జగన్



**కర్నూలుఆగస్టు13 ( జర్నలిస్ట్ వార్త)** రాష్ట్రంలో అధికార దుర్వినియోగం ఏ స్థాయిలో ఉందో చెప్పడానికి ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టు ఘటనే నిలువెత్తు నిదర్శనమని వైసీపీ అధినేత జగన్ అన్నారు. కర్నూలు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న ఎమ్మెల్యే విరూపాక్షిని గురువారం ఆయన ములాఖత్‌లో భాగంగా కలిశారు. అనంతరం జైలు బయట మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు 'రెడ్ బుక్' రాజ్యాంగాన్ని అమలు చేస్తూ, ప్రతిపక్ష నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.తాను ఇవాళ జైలుకు వస్తే తనను కూడా అవమానించే ప్రయత్నం చేశారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. "ఒక మాజీ ముఖ్యమంత్రిగా వచ్చిన నన్ను లోపల కూర్చోబెట్టి ఫోటో తీయకుండా, గ్రిల్స్ బయట నిలబెట్టి ఫోటో తీశారు. ఇది చంద్రబాబు శాడిస్టిక్ మనస్తత్వానికి నిదర్శనం. మా హయాంలో పీపుల్ ఫ్రెండ్లీ పోలీస్ స్టేషన్లు తీసుకొస్తే, వీళ్లు అవమానించే సంస్కృతిని తెచ్చారు" అని అన్నారు.ప్రభుత్వాలు శాశ్వతం కాదని చంద్రబాబు గుర్తుంచుకోవాలని జగన్ హెచ్చరించారు. "ఈరోజు మీరు ఏ తప్పుడు విత్తనాలు నాటుతున్నారో, అవే రేపు మహావృక్షాలై మిమ్మల్ని రెండింతలుగా చుట్టుకుంటాయి. ఈ కక్ష సాధింపు రాజకీయాలు మానుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవు" అని జగన్ హెచ్చరించారు. సమయం వేగంగా గడిచిపోతుందని, ఈ దుర్మార్గపు పాలనకు ప్రజలు త్వరలోనే చరమగీతం పాడతారని ఆయన వ్యాఖ్యానించారు."ఈ వెన్నుపోటు పార్టీ పాలనలో బాధితులే నిందితులుగా మారుతున్నారు. దాడికి గురైన వారిపైనే కేసులు పెడుతున్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని అక్రమంగా అరెస్టు చేస్తున్నారు. దీనికి విరూపాక్షి ఉదంతమే ప్రబల ఉదాహరణ" అని జగన్ పేర్కొన్నారు. ఆగస్టు 1న చిప్పగిరి మండలం సంగాల గ్రామంలో తమ పార్టీ కార్యకర్త గిరి తనపై దాడి జరుగుతోందని, రక్షించమని రాత్రి 7:45 గంటలకు ఎమ్మెల్యే విరూపాక్షికి ఫోన్ చేసి, వీడియోలు పంపాడని జగన్ ఆధారాలను చూపుతూ వివరించారు. వెంటనే ఎమ్మెల్యే స్థానిక ఎస్పైకి 7:47 గంటలకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చినా పోలీసులు స్పందించలేదన్నారు. పైగా, కార్యకర్తను కాపాడటానికి వెళ్లిన ఎమ్మెల్యేపై దాడి చేశారని, ఆయన తమ్ముడి చేయి విరగ్గొట్టారని ఆరోపించారు.దాడికి గురైన విరూపాక్షి ఫిర్యాదును పోలీసులు తీసుకోకపోగా, అర్ధరాత్రి 2:45 గంటలకు వందల మంది పోలీసులు దొంగల్లా ఆయన ఇంటిపై పడి, తలుపులు, సీసీ కెమెరాలు ధ్వంసం చేసి, ఒక ఉగ్రవాదిని పట్టుకున్నట్లు అరెస్టు చేశారని జగన్ మండిపడ్డారు. గంటల వ్యవధిలోనే ఎమ్మెల్యేపై, ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు కలిపి మొత్తం 38 మందిపై మూడు వేర్వేరు అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టారని తెలిపారు. ఒకే వ్యక్తి పేరును ఎఫ్ఐఆర్‌లో రెండుసార్లు చేర్చడం చూస్తే, కేసు ఎంత కట్టుకథో అర్థమవుతోందన్నారు.ఈ ప్రభుత్వం బీసీ, మైనారిటీ వర్గాల నాయకత్వాన్ని అణిచివేసేందుకు కుట్ర చేస్తోందని జగన్ ఆరోపించారు. మాజీ మంత్రి అప్పలరాజు కుమారుడి బైక్ యాక్సిడెంట్‌ను హత్యాయత్నంగా చిత్రీకరించడం, మాజీ ఎమ్మెల్యే ముస్తఫాపై కిడ్నాప్ కేసు పెట్టడం, కారుమూరు సునీల్‌పై అక్రమ కేసులు బనాయించడం వంటివి ఇందులో భాగమేనని విమర్శించారు.

# ప్రఖ్యాత 'న్యూయార్క్‌టైమ్స్'లో అమరావతిపై స్పెషల్ స్టోరీ..

## షేర్ చేసిన చంద్రబాబు



**అమరావతి,ఆగస్టు13 ( జర్నలిస్ట్ వార్త)** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి దేశానికే ఒక ఆదర్శంగా నిలవాలని, జీవన ప్రమాణాల్లో కొత్త బెంచ్‌మార్క్‌ను సృష్టించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. అమరావతిపై తమ ప్రభుత్వ విజన్‌కు అంతర్జాతీయ పత్రిక 'ది న్యూయార్క్ టైమ్స్'లో చోటు దక్కడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేశారు.

"కేవలం ఒక గొప్ప రాజధానిని నిర్మించడమే మా లక్ష్యం కాదు. భారతదేశంలో జీవన ప్రమాణాలకు సరికొత్త కొలమానాన్ని నిర్దేశించడమే మా ఆశయం" అని చంద్రబాబు పేర్కొన్నారు. హరిత నగరం, సమర్థవంతమైన, అందరినీ కలుపుకొనిపోయే నగరంగా, నాణ్యమైన జీవనశైలితో అమరావతిని తీర్చిదిద్దాలన్నదే తమ ధ్యేయమని వివరించారు.

ప్రపంచస్థాయి పట్టణ జీవనం అనేది ఒక సుదూర ఆదర్శం కాదని, భారత్ కూడా అలాంటి నగరాలను నిర్మించగలదని అమరావతి నిరూపిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. "మా లక్ష్యం ఆశయపూరితమైనదే, కానీ అది సాధించగలిగేదే. అమరావతి దేశానికి ఒక ఉదాహరణగా నిలవాలి" అని చంద్రబాబు తన పోస్టులో స్పష్టం చేశారు. ఈ పోస్టుతో పాటు న్యూయార్క్ టైమ్స్‌లో అమరావతిపై వచ్చిన కథనం లింకును కూడా ఆయన పంచుకున్నారు.

**అమరావతిపై 'న్యూయార్క్‌టైమ్స్' ప్రత్యేక కథనం ఇదే.. ఒక వ్యక్తి సంకల్పంతో రూపుదిద్దుకుంటున్న నగరం!**

ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతి నిర్మాణం ఇప్పుడు అంతర్జాతీయ దృష్టిని ఆకర్షిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టుపై అమెరికాకు చెందిన ప్రఖ్యాత పత్రిక 'ది న్యూయార్క్ టైమ్స్' (టీమ్) ఆగస్టు 13న "ఒక వ్యక్తి సంకల్పంతో భారత్‌లో అత్యంత నివాసయోగ్య నగరాన్ని నిర్మించే యత్నం" (One Manµs Quest to Build Indiaµs Most Livable City) అనే శీర్షికతో ఒక సమగ్ర కథనాన్ని ప్రచురించింది. కృష్ణా నది ఒడ్డున ఒకప్పుడు అరటి తోటలు, కూరగాయల పొలాలతో ఉన్న ప్రాంతంలో, ఇప్పుడు స్వతంత్ర భారతదేశంలోనే అతిపెద్ద పట్టణ ప్రణాళిక రూపుదిద్దుకుంటున్న తీరును ఈ కథనం కళ్లకు కట్టింది.

**'ది న్యూయార్క్‌టైమ్స్' కథనం ప్రకారం...**

సుమారు 5 కోట్ల జనాభా ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భవిష్యత్ అవసరాలకు తగినట్లుగా, ప్రపంచంలోనే అత్యంత నివాసయోగ్య నగరంగా అమరావతిని తీర్చిదిద్దాలన్నది చంద్రబాబు లక్ష్యం. ఇందుకోసం సుమారు 30,000 మంది రైతుల నుంచి 35,000 ఎకరాల భూమిని సమీకరించారు.

ప్రస్తుతం ప్రతిరోజూ 25,000 మందికి పైగా కార్మికులు నిర్మాణ పనుల్లో పాలుపంచుకుంటూ ఈ మహాయజ్ఞాన్ని ముందుకు నడిపిస్తున్నారు. ప్రఖ్యాత బ్రిటిష్ ఆర్కిటెక్ట్ నార్మన్ ఫోస్టర్ దీనికి అద్భుతమైన డిజైన్ అందించారు. నగరం మధ్యలో ఎత్తైన గోపురంతో శాసనసభ భవనం, దాని చుట్టూ మంచినీటి సరస్సు, ఐదు మైళ్ల పొడవునా ప్రభుత్వ భవనాలతో కూడిన గ్రిడ్ లేఅవుట్‌తో నగరాన్ని నిర్మిస్తున్నారు.అమరావతి కేవలం కాంక్రీట్ జంగిల్ కాదని, పర్యావరణ హితమైన జీవనశైలికి పెద్దపీట వేస్తున్నారని టీమ్ తన కథనంలో పేర్కొంది. నగరంలో దాదాపు 60 శాతం ప్రాంతం పచ్చదనం లేదా నీటి వనరులతో నిండి ఉండేలా ప్రణాళికలు రూపొందించారు. సైక్లింగ్ కోసం సుమారు 2,000 మైళ్ల ప్రత్యేక లేన్లు, నగరమంతా విస్తరించిన కాలువలు, జలమార్గాలు దీని ప్రత్యేకత.

వికేంద్రీకరణ ఉత్తమమని కొందరు నిపుణులు సూచించినప్పటికీ, ఒకే కేంద్రీకృత రాజధాని ద్వారా ఆధునిక, సమర్థవంతమైన పాలన అందించాలన్న బలమైన సంకల్పంతో చంద్రబాబు ఈ ప్రాజెక్టును ముందుకు నడిపిస్తున్నారని ఈ కథనం విశ్లేషించింది. ఆయన నాయకత్వంలో రాజకీయ మార్పుల అనంతరం నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి.ఈ నగరం కేవలం పరిపాలనకే పరిమితం కాకుండా, అత్యాధునిక టెక్నాలజీకి కేంద్రంగా మారనుంది. ఇందులో భాగంగా 50 ఎకరాల విస్తీర్ణంలో 'క్వాంటం వ్యాలీ' పేరుతో ఒక టెక్ హబ్ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే వందల మిలియన్ల డాలర్ల పెట్టుబడులు దీనికి ఖరారయ్యాయి.

ఇక్కడ భూకంపాలను తట్టుకునేలా నిర్మించిన భవనంలో వచ్చే ఏడాది జనవరి నుంచి 156-క్యూబిట్ సామర్థ్యమున్న ఐబీఎం క్వాంటం కంప్యూటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ప్రపంచ బ్యాంకు, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ వంటి అంతర్జాతీయ సంస్థలు తొలి దశ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తున్నాయి.

# దేశభక్తిని చాటిన తిరంగా యాత్ర



**ధర్మసాగర్/ఆగస్టు 13 (జర్నలిస్ట్ వార్త)**దేశ ప్రజల్లో దేశభక్తి, జాతీయ ఐక్యతను పెంపొందించాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ధర్మసాగర్ మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం భారీ తిరంగా యాత్ర నిర్వహించారు. మండల అధ్యక్షుడు బైరపాక కుమార్ నేతృత్వంలో జాతీయ జెండాలను చేతబూని నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా యాత్రలో పాల్గొన్నారు.మండల కేంద్రంలోని ప్రధాన వీధుల మీదుగా సాగిన యాత్రలో 'భారత్ మాతాకీ జై' నినాదాలు మార్మోగాయి. దేశ సమగ్రత, ఐక్యతను కాపాడటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాయకులు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు నిమ్మ సుదర్శన్‌రెడ్డి, నాగవెల్లి యుగంధర్, గాజుల సంపత్, పెరుమాండ్ల అమరేందర్‌రెడ్డి, గంకిడి వెంకట్‌రెడ్డి, పూల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు దుస్సా రాములు, దాసరి సాధానందం, మండల ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు గాజ శ్యాంసుందర్, మండల ఉపాధ్యక్షుడు మోరే రాజేందర్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు అనిరుద్ కౌండిన్య, రఘుదీర్, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్‌లో మాక్ పోలింగ్

### ఓటు విలువ తెలుసుకోవాలంటూ సంజీవరెడ్డి






**కేసముద్రం,/ఆగస్టు 13 (జర్నలిస్ వార్త):**కేసముద్రం మండలం కల్వల మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో గురువారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ పరిమిన్ నవీన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంటా సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాక్ పోలింగ్‌లో ఓటు వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో కీలకమన్నారు. ఎన్నికల ప్రక్రియ, ఓటు వేసే విధానం, ఓటు రహస్యాన్ని విద్యార్థులు తెలుసుకోవాలనే ఉద్దేశంతో మాక్ పోలింగ్ నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థి దశ నుంచే ఓటు విలువపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. భవిష్యత్‌లో మంచి నాయకుడిని ఎన్నుకోవడం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి దోహదపడుతుందని తెలిపారు.మాక్ పోలింగ్‌లో హెడ్‌బాయ్ వినయ్, హెడ్‌గర్ల్ ఉషశ్రీ అత్యధిక మెజార్టీతో విజయం సాధించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుజాత రామచంద్ర, ఉపసర్పంచ్ రవి, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైలు ఢీకొని టీచర్ మృతి

**మహబూబాబాద్,ఆగస్టు13 ( జర్నలిస్ట్ వార్త)** జిల్లాలో విషాద ఘటన చోటు చేసుకుంది. పుష్‌పుల్ రైలు ఢీకొని ఓ ఉపాధ్యాయుడు దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మైనార్టీ గురుకుల పాఠశాలలో మ్యాథ్స్ టీచర్‌గా పని చేస్తున్న ఎండీ గౌస్‌మియా మహబూబాద్ రైల్వే స్టేషన్‌లో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గౌస్‌మియా మృతిపట్ల పలువురు సంతాపం తెలిపారు.

# ఆబిడ్స్‌లో మహిళపై దూసుకెళ్లిన కారు

### కారు సినీ నిర్మాత పోలీసుల కేసు నమోదు



**హైదరాబాద్,ఆగస్టు13 ( జర్నలిస్ట్ వార్త)** నగరంలోని అబిడ్స్‌లో ఓ కారు బీభత్సం సృష్టించింది. నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న ఓ మహిళను కారు ఢీకొట్టడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. గన్‌ఫౌండ్రీ ఎస్‌బీఐ బ్యాంకులో హౌస్‌కీపింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న సునీత.. విధులు ముగించుకుని ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ క్రమంలో సినిమా నిర్మాత డ్రైవర్ మహానంద నడుపుతున్న కారు ఒక్కసారిగా ఆమెపైకి దూసుకెళ్లినట్లు బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాదంలో సునీత కాలుకు ఫ్రాక్చర్ కావడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆమెను సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారు యజమాని.. ఫిల్మ్ ప్రొడ్యూసర్ బొమ్మకు మురళి యజమాని అని బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. ఘటన అనంతరం ఆయనకు ఫోన్ చేసి సునీత చికిత్సకు అయ్యే ఖర్చులను భరించాలని కోరినట్లు చెప్పారు. అయితే డబ్బులు ఇవ్వనని దురుసుగా సమాధానం ఇచ్చినట్లు వారు వాపోయారు. వారి ఫిర్యాదు మేరకు.. అబిడ్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అంత్యక్రియలకు వచ్చి.. చెరువులో దిగి ఇద్దరు మృత్యువాత

**సంగారెడ్డి,ఆఆగస్టు13 ( జర్నలిస్ట్ వార్త)** జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. జిన్నారం మండలం వావిలాల గ్రామంలో చెరువులో స్నానానికి వెళ్లిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. బంధువు అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వచ్చిన గణెళిష్ (30), మునిరాజు (58) ప్రాణాలు కోల్పోయారు. అంత్యక్రియలు పూర్తయిన అనంతరం ఇద్దరూ చెరువులో స్నానం చేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో గణెళిష్‌కు ఒక్కసారిగా మూర్ఛ రావడంతో అదుపు తప్పి నీటిలో పడిపోయాడు. చెరువులో మునిగిపోతున్న గణెళిష్‌ను గమనించిన మునిరాజు.. కాపాడేందుకు వెంటనే నీటిలోకి వెళ్లాడు. అయితే గణెళిష్‌ను రక్షించే ప్రయత్నంలో మునిరాజు కూడా నీటిలో మునిగిపోయాడు. ఇద్దరూ చాలాసేపు బయటకు రాకపోవడంతో అక్కడ ఉన్నవారు ఆందోళనకు గురయ్యారు. వెంటనే సమాచారం అందడంతో స్థానికులు చెరువు వద్దకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు ఇద్దరి మృతదేహాలను బయటకు తీసినట్లు సమాచారం. అంత్యక్రియలకు హాజరైన కుటుంబాల్లో ఈ ఘటన మరో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.